చిన్నారులందరికీ విద్య అందించాలి

● ఎంఈఓలు ఆంజనేయులు, శ్రీనివాసరావు

మద్దిపాడు: చిన్నారులందరికీ విద్య అందించేందుకు ప్రతిఒక్క ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని ఎంఈఓలు ఎంవీఆర్ ఆంజనేయులు, ఎం.శ్రీనివాసరావు కోరారు. శనివారం మండల కేంద్రంలో ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బందికి సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం తలపెట్టిన నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా 6 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల వయసు చిన్నారులందరినీ పాఠశాలలో చేర్పించాలని ఆదేశించారు. పాఠశాలకు వెళ్లడం మానేసి పనికి వెళ్తున్న వారిని కూడా మళ్లీ పాఠశాలలో చేర్పాలన్నారు. విద్యాహక్కు చట్టం ద్వారా వారికి విద్య నేర్పాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయునిపై ఉందన్నారు. ఉపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ వర్కర్లు సమష్టిగా గ్రామాల్లో తిరిగి పాఠశాలలో విద్యార్థులను నమోదు చేయించాలన్నారు. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, షూ తదితర వస్తువులన్నీ సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ నెల 13వ తేదీ నుంచి జూలై 12వ తేదీ వరకూ ఈ కార్యక్రమం నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ప్రతిరోజూ నిర్వహించాల్సిన ప్రత్యేక కార్యక్రమాల వివరాలు తెలియజేశారు. మండల స్థాయి పర్యవేక్షణ కమిటీలో ఎంఈఓలు, తహసీల్దార్, ఎంపీడీఓ, సీడీపీఓ ఉంటారని, గ్రామస్థాయిలో సర్పంచ్, పీఎంసీ చైర్మన్, వెల్ఫేర్ అసిస్టెంట్, అంగన్‌వాడీ వర్కర్లు బాధ్యతలు నిర్వహిస్తారని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ సుబ్బారావు, మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓలు

శ్రీగిరి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


వాస్తు హోమం నిర్వహిస్తున్న వేద పురోహితులు

ఒంగోలు మెట్రో: ఒంగోలులోని కొండమీద గల శ్రీగిరి వెంకటేశ్వరస్వామి ఆలయ 28వ వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆలయ నిర్వాహకులు శనివారం సాయంత్రం శ్రీకారం చుట్టారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు శ్రీవారికి సహస్ర నామార్చన నిర్వహించారు. తిరుమలకు చెందిన పరాంకుశం సీతారామాచార్యుల బృందం ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనము, మేదినీ పూజ, మృత్సంగ్రహణం, వాస్తు హోమం, ధ్వజ దండ, ధ్వజపట గరుడ ప్రతిష్ఠ తీర్మాన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి పర్యవేక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కలియుగ ప్రత్యక్ష దైవం బ్రహ్మాండ నాయకుడైన శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించి భక్తులు తన్మయత్వంతో గోవింద నామస్మరణ చేశారు. శ్రీ మహావిష్ణు సహస్ర నామపారాయణలో పలువురు మహిళా భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శ్రీగిరి బ్రహ్మోత్సవాలలో నేటి కార్యక్రమాలు...

శ్రీగిరి వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రెండోరోజు ఉదయం రక్షా బంధనం, భేరీపూజ, ధ్వజారోహణం, విశేష స్నపన తిరుమంజనం, సాయంత్రం కుంభ పూజ, బలిహోమం, శ్రీవారికి శేషవాహన సేవ సందర్భంగా రంద శరణ్య కూచిపూడి డ్యాన్స్ అకాడమీ హైదరాబాద్ వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహిస్తారు.

ఇదేం డీఎస్సీ చంద్రబాబు ?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ఒంగోలు టౌన్: ఎన్నికల ముందు మెగా డీఎస్సీ ప్రకటిస్తామంటూ హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక కేవలం 16,347 మందికి మాత్రమే డీఎస్సీ ప్రకటించడం చాలా అన్యాయమని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని మాదాల నారాయణస్వామి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 34 వేల ఉపాధ్యాయ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 50 వేల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు కేంద్రం ప్రకటించడాన్ని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 2.50 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసేందుకు తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలకు అదనంగా రెండు నెలల సమయం ఇవ్వాలని, విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్లతో సమావేశం నిర్వహించాలని కోరారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.వెంకటేష్, సీహెచ్ సిసింద్రీ, ప్రగతిశీల యువజన సంఘం నాయకులు కె.సుధాకర్, సి.తిరుమలరావు, ఆ సంస్థ మాజీ అధ్యక్షుడు శ్యాం పాల్గొన్నారు.

కర్నూలు రోడ్డులో సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు: స్థానిక కర్నూలు రోడ్డులో ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కర్నూలు రోడ్డు షాపు ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మారెళ్ల సుబ్బారావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కర్నూలు రోడ్డు షాపు ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి అసోసియేషన్ అధ్యక్షుడు చేరెడ్డి లక్ష్మణ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ కాలువలు సరిగ్గా లేక వర్షం వస్తే రోడ్లన్నీ వర్షం నీటితో మునిగి షాపుల్లోకి నీరు వస్తోందన్నారు. కార్పొరేషన్ మేయర్, కమిషనర్ కర్నూలు రోడ్డును సందర్శించి కాలువల్లో పూడిక తీయించి వర్షం నీరు పోతురాజుకాలువలోకి వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కర్నూలు రోడ్డులోని మాల్స్, బ్యాంకుల వద్ద వాహనాలు అస్తవ్యస్తంగా ఉంచడం వలన ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. బ్యాంకులు, మాల్స్ వద్ద సెక్యూరిటీ గార్డును పెట్టుకుని వాహనాలను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు కలుగజేసుకుని ఆర్టీసీ బస్టాండు వద్ద సాగర్ సెంటర్లో సిగ్నల్స్‌ను క్రమబద్ధీకరించాలన్నారు. కర్నూలు రోడ్డు వ్యాపారస్తుల కుటుంబాల గెట్ టుగెదర్, శ్రావణ మాసం విహార యాత్రకు కర్నూలు రోడ్డులోని వ్యాపారస్తులంతా కుటుంబ సభ్యులతో రావాలని కోరారు. కోశాధికారి ఉన్నవ వెంకటేశ్వరరావు జమ, ఖర్చులు ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కొల్లా మధు, బత్తుల ముసలారెడ్డి, అమృత శంకరరావు, సీడ్స్ సుబ్బారావు, బేరింగ్ షాపు కొండయ్య, బసవ పున్నయ్య, రాఘవరెడ్డి, అంజిరెడ్డి, అబ్బూరి లక్ష్మీనారాయణ, షేక్ హుస్సేన్, డాక్టర్ గుంటూరు భాస్కరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కర్నూలు రోడ్డు షాపు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్‌రెడ్డి

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

ఒంగోలు: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి అనిత రోజ్ రాణి అన్నారు. ఎకో క్లబ్స్ ఫర్ మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక బండ్లమిట్ట నుంచి అద్దంకి బస్టాండు వరకు విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. పెరిగిపోతున్న ఉష్ణతాపాన్ని తగ్గించాలంటే విరివిగా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఒంగోలు మండల విద్యాశాఖ అధికారి టి.కిషోర్‌బాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఉపవిద్యాశాఖ అధికారి అనిత రోజ్ రాణి

బక్రీద్ పండుగ ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు

మద్దిపాడు: మండలంలో బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ అనూరాధ, రూరల్ సీఐ టీఎక్స్ అజయ్ కుమారు తెలిపారు. శనివారం మండల తహసీల్దార్ కార్యాలయంలో ముస్లిం మతపెద్దలతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బక్రీద్ పండుగ నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మద్దిపాడు ఎస్ఐ మహేష్, వెటర్నరీ డాక్టర్ మాధవీలత, పలువురు మత పెద్దలు పాల్గొన్నారు.


ముస్లిం మత పెద్దలతో మాట్లాడుతున్న తహసీల్దార్ అనూరాధ, రూరల్ సీఐ అజయ్‌కుమార్, ఎస్ఐ

క్లుప్తంగా

గోవధ చేస్తే చట్ట ప్రకారం చర్యలు

ఒంగోలు: బక్రీదు పండుగ సందర్భంగా గోవధ చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంతరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చట్టం అమలుకు సంబంధించి పలు టీములను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పట్టణ ప్రజలు ఎవరైనా గోవధ చేయడంగానీ, గో మాంసాన్ని ఉచితంగా ఇవ్వడం, విక్రయించడంగానీ చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేణుగోపాల స్వామికి విశేష పూజలు

తర్లుపాడు: తర్లుపాడులో వెలసిన శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామికి శనివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 8 గంటలకు స్వామివారిని వివిధ రకాల పూలతో అలంకరించి పంచామృతాభిషేకం, అష్టోత్తర పూజలు నిర్వహించారు. తర్లుపాడులోని పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి వార్షికోత్సవం

ఒంగోలు మెట్రో: స్థానిక బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌లో గల వెంకటేశ్వరస్వామి ఆలయ 28వ వార్షికోత్సవాన్ని మందిర ధర్మకర్తలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం మూడోరోజు అద్దంకి తిరుమల శ్రీనివాస నరసింహ తాతాచార్యులు పర్యవేక్షణలో వైఖానసాగమ ప్రవర శ్రీమాన్ దివి తిరుమల సత్యనారాయణ ప్రసాద్ ఆగమ పరీక్ష అధికారి యాజ్ఞీక నిర్వహణలో ఆలయ అర్చకులు నల్లూరి రవికుమారాచార్యులు విష్వక్సేన పూజ పుణ్యాహం, అగ్ని ప్రణయం, నిత్య హోమాలు, ఉక్త హోమాలు, కుంభార్చన, శ్రీవారికి అర్చన, నివేదన హారతి, మంత్రపుష్పం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఆరు గంటలకు మంగళ వాయిద్యాలతో శ్రీవారికి అర్చన, రాత్రి ఏడు గంటలకు శ్రీవారికి గరుడోత్సవం, వయ్యాళి సేవ, ఉత్త హోమాల నివేదన, హారతి, మంత్ర పుష్పంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీవారి గరుడ ఉత్సవంలో స్వామివారికి జరిగే కైంకర్య పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవారి ఆశీసులు అందుకున్నారు.


గరుడ సేవలో వైకుంఠ వాసునిగా దర్శనమిస్తున్న కలియుగ వెంకటేశ్వరస్వామి

పేస్ అధ్యాపకునికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకున్న జానకీరామ్

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగానికి చెందిన ఎం.జానకీరామ్ డాక్టరేట్ అందుకున్నారు. కర్నూలు జిల్లా రాయలసీమ యూనివర్శిటీ నుంచి ఈ డాక్టరేట్‌ను ఆయన పొందారు. డాక్టర్ సర్దార్ గిగ్లోత్ గైడెన్స్‌లో 'ఏ స్టడీ ఆన్ మార్కెటింగ్ స్ట్రాటజీస్ ఆఫ్ హోటల్ ఇండస్ట్రీస్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఈ డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఆయనకు పేస్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపాల్, వివిధ విభాగాల అధిపతులు అభినందనలు తెలిపారు.

కూచిపూడి వేసవి శిక్షణ తరగతులు ముగింపు


నృత్య ప్రదర్శనలో విద్యార్థినులు


ప్రశంసపత్రాలు అందుకున్న చిన్నారులతో నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: నళినిప్రియ కూచిపూడి నృత్యనికేతన్ సంస్థ ఆధ్వర్యంలో మే 1వ తేదీ ప్రారంభమై 45 రోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణ కూచిపూడి శిక్షణ తరగతుల ముగింపు వేడుకలను శనివారం సాయంత్రం సంతపేట సాయిబాబా మందిరంలో నిర్వహించారు. రిటైర్డ్ హెడ్మాస్టర్ ఎస్వీ శేషయ్య అధ్యక్షతన శ్రీ ఆలయ ధర్మకర్తలు అళహరి చెంచలరావు, నెక్స్ట్ జన్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్‌కృష్ణ, ఎక్కిరాల వేదవతి ముఖ్య అతిథులుగా పాల్గొని శిక్షణ పొందిన చిన్నారుల ప్రదర్శనలను తిలకించి ప్రశంసించారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసపత్రాలను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో బీవీ సురేష్‌బాబు, ఏ ఫణికుమార్, కుమారి వందన, వర్షిణి పాల్గొన్నారు.

మూగ యువతిపై అత్యాచారాన్ని ఖండించిన బీజేపీ

ఒంగోలు సెంట్రల్: మూగ యువతిపై చీమకుర్తి మండలంలో జరిగిన సామూహిక అత్యాచారం మానవత్వానికి మాయని మచ్చ అని బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బి.విజయరావు ఖండించారు. సభ్య సమాజానికి సిగ్గుచేటని మండిపడ్డారు. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఇటువంటి అనైతిక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమాజంలో జరుగుతున్న ఇలాంటి వాటిపై మహిళలు, ఆడపిల్లలు అవగాహన కలిగి ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల కదలికలపై మరింత దృష్టి సారించాలని విన్నవించారు.

దర్శనం కోసం పోటెత్తిన భక్తులు

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్లరంగ నాయకస్వామి దర్శనం కోసం శనివారం అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. దేవస్థానం అర్చకులు అన్నవరం పాండురంగాచార్యులు, అన్నవరం సత్యనారాయణచార్యులు స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు గోపాలకృష్ణ యాదవ, కృష్ణదేవరాయుల కాపుబలిజ, కాశినాయన, యోగివేమన రెడ్ల, ఆర్యవైశ్య అన్నదాన సత్రాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

లో ఓల్టేజీ సమస్యతో ప్రజల ఇక్కట్లు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాజానగర్, ఏబీఎం పాలెం, నల్లబండ బజారులోని శేషారెడ్డి వీధి, మంగలి కాలనీ, 5వ వార్డులో చాకలి వీధి, నెహ్రూ బజారు, శ్రీరామ్‌నగర్, లో ఓల్టేజీ సమస్యల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా వీధుల్లో విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సింగి ఫేస్ తీగలను త్రీ ఫేస్‌గా మార్చక పోవడంతో ఆయా ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారి గృహోపకార వస్తువులు పూర్తిగా కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెల వేసవి కాలంలో ఏసీలు వేయడంతో అధికలోడుల కారణంగా తరుచూ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడేదని స్థానికులు వాపోయారు. వర్షాకాలం సమయంలో ఈదురు గాలుల కారణంగా విద్యుత్ లోడు హెచ్చు తగ్గులు వస్తుండటంతో ఇంట్లోని ఫ్రిజ్, ఫ్యాన్లు, టీవీలు, మిక్సీ వంటి వస్తువులు కాలిపోతున్నాయి. ఈ విషయమై డీఈఈ శేషగిరిరావును వివరణ కోరగా తమ వద్ద స్టాకు లేదని, ప్రతిపాదనలు పంపుతున్నామని చెబుతున్నారు.